

ఉర్సు గుట్ట వద్ద ఉన్న రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బినామీల భరతం!



రేషన్ దుకాణాల్లో బియ్యం సరఫరా (ఫైల్)

వరంగల్ సిటీ, జనవరి 16: బినామీ రేషన్ డీలర్ల భరతం పట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20వరకు రేషన్ షాపుల తనిఖీలను చేపట్టేందుకు పూనుకుంది. ఈ తనిఖీలు మంగళవారం నుంచే అధికారులు జిల్లాలో ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశానుసారం కోసం ఫైలును పంపించి, తనిఖీలను అధికారులు షురూ చేశారు.

పర్యవేక్షణ లేకనే బినామీలు...

చౌకధరల దుకాణాలపై దశాబ్దాలుగా పర్యవేక్షణ లేకనే బినామీలు రేషన్ డీలర్లుగా కొనసాగుతున్నారనే విమర్శలున్నాయి. అనర్హులకు కొమ్ముకాసే అధికారులుండడంతో బినామీ డీలర్ల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అసలైన రేషన్ డీలర్లలో కొంతమంది మరణించడం, మరికొంత మంది వివిధ కారణాలతో వదిలివేయడం, ఇంకొంత మంది కేసుల భయంతో పాటు పౌరసరఫరాల శాఖాధికారుల్లోని కొంతమంది నిరక్ష్యంతోనే బినామీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పలువురిని అధికారులు అక్రమంగా డీలర్లుగా నియమించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లాయి.

జిల్లాలో బినామీలదే రాజ్యం...

వరంగల్ జిల్లా వ్యాప్తంగా బినామీ రేషన్ డీలర్లేదే రాజ్యం నడుస్తున్నట్లు రేషన్ డీలర్లే చర్చించుకుంటున్నారు. జిల్లాలో 13 మండలాల్లో మొత్తం 527 చౌకధరల దుకాణాలు ఉండగా, 2,66,679 కార్డులున్నాయి. ప్రతీనెల 4,978.287 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 7,50,352 మంది లబ్ధిదారులకు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు సరఫరా చేస్తున్నారు. వరంగల్, ఖిలా వరంగల్ మండలాల పరిధిలోనే 14 మంది బినామీ రేషన్ డీలర్లుగా చలామణి అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగతా 11 మండలాల్లోనూ భారీ సంఖ్యలోనే బినామీలే బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంత మంది రేషన్ డీలర్లు వారి కుటుంబ సభ్యుల పేర్ల మీద ఈ-పాస్ బయోమెట్రిక్ నమోదు చేయించి, బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో కొత్తగా నలుగురు రేషన్ డీలర్లను నియమించగా వారి నియామకం సరైనది కాదని అధికారులకు ఫిర్యాదులు వెళ్లడం గమనార్హం.

20 దాకా తనిఖీలు... 31న నివేదిక...

రాష్ట్ర వ్యాప్తంగా బినామీ రేషన్ డీలర్లను ఏరివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న నేపథ్యంలో అందుకనుగుణంగా పౌరసరఫరాల శాఖ అడుగులు వేస్తోంది. ఈనెల 20 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారు. తనిఖీల్లో వారు గుర్తించిన అన్ని విషయాలను నివేదికల రూపంలో పొందుపరిచి ఈనెల 31న ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఫిబ్రవరిలో ప్రభుత్వం బినామీ రేషన్ డీలర్లను తొలగించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

పక్కాగా లెక్క తేలేనా...?

జిల్లాలో బినామీలతో నడుస్తున్న చౌకధరల దుకాణాలను గుర్తించే ప్రక్రియలో జిల్లా పౌర సరఫరా శాఖాధికారుల కీలకం కానున్నారు. అయితే ఈ శాఖలోని కొంతమంది అధికారులే బినామీలకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో తనిఖీలు పారదర్శకంగా జరుగుతాయా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అధికారులు తనిఖీల్లో పక్కాగా పరిశీలన చేస్తేనే బినామీలను గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే ఆ మేరకు అధికారులు విధులు నిర్వర్తిస్తారా... ఒత్తిళ్లకు తలొగ్గి లోటుపాటు తనిఖీలు చేస్తారో వేచి చూడాలి. అయితే జిల్లాలో బినామీల అక్రమ వ్యాపారం విమర్శలకు తావిస్తుండటంతో అధికారులు చిత్తశుద్ధితో తనిఖీలకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది.

లెక్కతేలితే మరిన్ని ఖాళీలు..

జిల్లాలో రేషన్ దుకాణాల తనిఖీల అనంతరం ఎన్ని ఇన్‌చార్జి డీలర్లతో నడుస్తున్నాయో లెక్క తేలనుంది. దశాబ్దాల కాలంగా అధికారులు దృష్టి సారించకపోవడం, వివిధ కారణాలతో ఖాళీ అయిన దుకాణాలకు ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఇన్‌చార్జీలను నియమించడంతోనే బినామీ రేషన్ డీలర్లు పుట్టుకొచ్చినట్లు విమర్శలున్నాయి. ఈ నెల 20వరకు తనిఖీలు నిర్వహిస్తే అసలు విషయం బట్టబయలు కానుంది. జిల్లాలోని 13 మండలాల పరిధిలో మొత్తం 527 చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్న పౌర సరఫరాల అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీటిల్లో ఎన్ని దుకాణాలు ఇన్‌చార్జీలతో నడిపిస్తున్నారో లెక్క తేలిపోనుంది. బల్దియా పరిధిలోని వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలోనే సుమారు 14 మంది ఇన్‌చార్జీ డీలర్లు దుకాణాలను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా మండలాలను కలిపితే జిల్లా వ్యాప్తంగా 20 శాతం దుకాణాలు ఖాళీలుగా ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

- బినామీ రేషన్ డీలర్ల ఏరివేతకు రంగం సిద్ధం
- ఈనెల 20వరకు రేషన్ షాపుల తనిఖీలు
- 31న ఉన్నతాధికారులకు నివేదిక
- తనిఖీలను ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ
- పారదర్శకంగా తనిఖీలు చేయాలంటున్న ప్రజలు

జిల్లాలో రేషన్ కార్డులు, లబ్ధిదారుల వివరాలు...

మండలం	షాపులు	కార్డులు	లబ్ధిదారులు	బియ్యం (మెట్రిక్ టన్నులు)
చెన్నారావుపేట	23	13,044	34,970	236.770
దుగ్గొండి	34	14,898	38,949	261.974
గీసుగొండ	35	18,456	49,601	325.046
ఖానాపూర్	20	10,263	28,061	194.196
ఖిలావరంగల్	72	47,686	1,38,198	897.263
నల్లబెల్లి	30	11,429	32,314	221.989
నర్సంపేట	40	22,325	60,522	410.102
నెక్కొండ	35	17,241	45,575	308.985
పర్వతగిరి	35	15,003	42,377	277.552
రాయపర్తి	38	16,469	50,388	323.748
సంగెం	41	14,824	41,510	270.270
వరంగల్	86	49,905	1,46,410	970.695
వర్ధన్నపేట	38	15,136	41,477	279.697

నియామకం జరిగేనా...?

ప్రభుత్వం బినామీ రేషన్ డీలర్ల భరతం పట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా, తద్వారా ఖాళీలు ఏర్పడే దుకాణాలకు కొత్తగా డీలర్ల నియామకం ఎప్పుడు చేస్తారో మాత్రం స్పష్టంగా చెప్పడం లేదు. జిల్లాలో 20శాతం డీలర్లు ఖాళీ అయ్యే అవకాశం ఉండటంతో దశాబ్దాలుగా రేషన్ డీలర్ల కోసం వేచి చూస్తున్న యువతలో ఆశలు రేకేత్తుతున్నాయి. అయితే ప్రభుత్వం నియామకం చేపట్టేందుకు మాత్రం ఇప్పటివరకైతే ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఖాళీలు అయిన దుకాణాలకు నోటిఫికేషన్ ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయాలని జిల్లాలోని యువత ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పారదర్శకంగా తనిఖీలు..

\- కె.చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి



ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా తనిఖీలు నిర్వహిస్తాం. బినామీ రేషన్ డీలర్లను ఏరివేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా పని చేస్తాం. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్పష్టమైన పరిశీలన చేస్తాం. కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో అక్రమ వ్యాపారం చేస్తున్న బినామీ రేషన్ డీలర్లను గుర్తించి సమగ్రమైన నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

ప్రతీ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 16: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ జారీ చేసిన సర్క్యూలర్ ప్రకారం జిల్లాలోని 509 రేషన్ దుకాణాలను మండలాల పరిధిలోని తహసీల్దార్లు, డీసీఎస్‌వో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని 13 మంది తహసీల్దార్లతో పాటు ఏసీఎస్‌వోలు, డీటీసీఎస్, సిబ్బందితో కలిసి 13 టీమ్‌లుగా ఏర్పడి ప్రతీ రేషన్ దుకాణంలో తనిఖీలు చేస్తారన్నారు. ఆర్డీవో జారీ చేసిన గుర్తింపు కాపి, ఈపీవోఎస్ఎస్ యంత్రంలో పేర్లను క్షుణ్ణంగా పరిశీలించి ఆ దుకాణంలో బినామీ డీలర్ ఉన్నట్లు రుజువైతే -6ఏ కేసుతోపాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేయబడుతుందన్నారు. తనిఖీ బృందం బియ్యం నాణ్యతను పరిశీలించి నాణ్యమైన బియ్యం సరఫరా చేయకకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

తనిఖీల సమయంలో ఒరిజినల్ డీలర్ మాత్రమే రేషన్ దుకాణం నడపాల్సిందిగా అలాగే రికార్డు ప్రకారం స్టాక్ ఉండాల్సిందిగా ఈకేవైసీ డాటాను వంద శాతం పూర్తి చేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. అలాగే ప్రతీ రేషన్ షాపు డీలర్ వారి దుకాణం వివరాలు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సంబంధిత మండల తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్‌ల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డును టోల్ ఫ్రీ నంబర్ 1967 వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించి గుర్తింపు కాపీని ధరల పట్టిక తూకానికి సంబంధించి లీగల్ మెట్రాలజీ స్టాంప్ ఉండాలని ఆదేశించారు. మంగళవారం రోజున ఉర్సు గుట్టలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

సంక్రాంతి సంబరాలు

- ఘనంగా జరుపుకున్న జిల్లా వాసులు
- ముగిసిన మూడు రోజుల వేడుకలు



గీసుగొండ మండలం ఎలుకుర్తిలో యువతి ముగ్గు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 16: సంక్రాంతి సంబరాలను జిల్లా వాసులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలు చేసుకున్నారు. దీంతో మూడు రోజుల సంక్రాంతి వేడుకలు ముగిశాయి. ఇంటింటా పిండి వంటలతో బంధు మిత్రులతో కుటుంబ సభ్యులతో పండుగ సందడిగా సాగాయి. ఇంటి ముందు ముగ్గుల హరివిల్లు గొబ్బెమ్మలతో అలరించాయి. వయసుతో తారతమ్యం లేకుండా గాలిపటాలు ఎగరవేసి కేరింతలు కొట్టారు. పండుగలకు సొంతూళ్లకు ఇళ్లకు వచ్చిన వివిధ ప్రాంతాల్లో వృత్తిరీత్యా ఉన్న వారు సోమవారం రాత్రి నుంచే తిరుగు ప్రయాణమయ్యారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా దేవాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. పండుగ సోమవారం కావడంతో శివాలయాల్లో అభిషేకాలు, దర్శనాలు కొనసాగాయి. ఐనవోలు మల్లన్న, కొమురవెల్లి మల్లన్న, కొత్తకొండ వీరభద్రన్న జాతరలకు తరలి వెళ్లే భక్తుల కోసం బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులే కాకుండా ప్రైవేటు వాహనాలు జీపులు, ఆటోలు పెద్ద సంఖ్యలో జాతరలకు తరలి వెళ్లాయి. పండుగ రోజున మొక్కులను చెల్లించుకున్నారు. ఎట్టకేలకు ప్రశాంతంగా సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి.

మమ్మేలు మల్లన్న..

- సంక్రాంతి వేళ పోటెత్తిన ఐనవోలు క్షేత్రం
- మల్లన్నను దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు
- గుబాళించిన సంస్కృతీ సంప్రదాయాలు
- పూనకంతో ఊగిపోయిన భక్తులు, శివసత్తులు
- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు
- మహానివేదనతో దేవుడి రథం ఊరేగింపు





ఐనవోలు జాతరలో శివసత్తుల పూనకాలు (ఇన్‌సెట్‌లో.. మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు)

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 16: గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

Government of Telangana
Social Welfare Residential Educational Institutions Society
(TSWREIS)

ఏటీఎంల ధ్వంసం

- ఐదు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం
- డబ్బులు రాలేదన్న అక్కసుతో మిషన్లపై రాళ్లతో దాడి
- రూ.4.5 లక్షల ఆస్తి నష్టం
- నాలుగు గంటల్లోనే నిందితుడి అరెస్టు పోలీసులు
- నర్సంపేటలో ఘటన



ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం

నర్సంపేట టౌన్, జనవరి 16 : జల్సాలకు అలవాటుపడిన ఓ కొరియర్ బాయ్ ఏకంగా ఐదు ఏటీఎంలలో చోరీకి విఫలయత్నం చేయగా, డబ్బులు రాలేదన్న అక్కసుతో ఏటీఎం మిషన్లను రాళ్లతో ధ్వంసం చేసిన ఘటన నర్సంపేట పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. ఘటన జరిగిన నాలుగు గంటల్లోనే సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ అరెస్టు వివరాలను వెల్లడించారు. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్‌కు చెందిన 19ఏళ్ల మేడిద వంశీ కొన్ని రోజులుగా ఓ కంపెనీలో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు, మద్యానికి అలవాటుపడి కొరియర్‌గా పనిచేస్తే వచ్చే డబ్బులు, ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ఏటీఎంలో దొంగతనం చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం సేవించి ఏటీఎంలో దొంగతనానికి వెళ్లాడు. ద్వారకపేటరోడ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం, వరంగల్‌రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం, నెక్కొండ రోడ్‌లోని కెనరా బ్యాంక్ ఏటీఎం, మల్లంపల్లి రోడ్‌లోని ఎస్‌బీఐ, పాకాల్‌రోడ్‌లోని కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశాడు. ప్రతీ ఏటీఎంలో డబ్బులు తీయడం సాధ్యం కాకపోవడంతో రాళ్లతో అన్ని మిషన్లను ధ్వంసం చేశాడు. సమాచారం తెలుసుకున్న నర్సంపేట సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి, హెడ్‌కానిస్టేబుల్ అక్బర్‌పాష, కానిస్టేబుల్స్ శ్రీధర్,

మిగతా 8వ పేజీలో..

కోర్కెలు తీర్చే నరసింహుడు..

- జాతరకు గీసుగొండ ముస్తాబు
- 23 నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర
- ప్రకృతి ఒడిలో అలరించే ఆలయగుట్ట
- స్వయంభు ఆలయంగా గుర్తింపు..
- శాతవాహనుల ఆనవాళ్లు..
- ఏటేటా పెరుగుతున్న భక్తులు



శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్


గీసుగొండ, జనవరి 16: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతరకు ముస్తాబవుతోంది. ఈనెల 23 నుంచి 27వరకు జరిగే జాతరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే గీసుగొండ జాతరకు ఎంతో ప్రాముఖ్యముంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతీఏడాది జనవరిలో వచ్చే పౌర్ణమిరోజున జాతర జరుగుతుంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఇక్కడ స్వామి వారు స్వయంభుగా అవతరించడంతో ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఎడ్లబండ్లపై భక్తులు ఆలయగుట్ట చుట్టూ విడిది చేసి దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. సమ్మక్క జాతరకు వెళ్లే ముందు ఇక్కడి స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ఏళ్ల నుంచి వస్తోంది. కూడా భక్తుల్లో ఉంది.

వంద ఎకరాల విస్తీర్ణంలో ఎత్తైన గుట్ట..

గీసుగొండ గుట్ట సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆలయ గుట్ట సుమారు 300 అడుగుల ఎత్తులో ఉండడం విశేషం. ఒకప్పుడు గుట్టపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవాలంటే భక్తులు నానాతంటాలు పడేవారు. గుట్టపైకి వెళ్లేందుకు మెట్లతోపాటు వాల్‌గ్రిల్స్‌ను రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ ఏర్పాటు కట్టించారు. గుట్ట వరకు పలు మార్గాల్లో బీటీ రోడ్లను కూడా ఏర్పాటు చేశారు. వరంగల్ మహానగరానికి 8 కి.మీల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకోవటానికి గొర్రెకుంట, పోతరాజుపల్లి మీదుగా, కోటగండి సాయి బాబా ఆలయం నుంచి, బొడ్డుచింతలపల్లి నుంచి, ఏనుమాముల మార్కెట్ నుంచి మొగిలిచర్ల మీదుగా, అక్కంపేట, బాలయ్యపల్లి మీదుగా, మండల కేంద్రం గీసుగొండ నుంచి కూడా బీటీ రోడ్లు భక్తులు వెళ్లటానికి అనుకూలంగా ఉన్నాయి. ఎత్తైన గుట్టపై నుంచి చూస్తే పరిసరాలు, ప్రకృతి సౌందర్యం ప్రతీ మనసును పరవశింపజేస్తుంది. ఈ గుట్టపై నుంచి వరంగల్ మహానగరం చూడముచ్చటగా కనిపిస్తుంది.

శాతవాహనుల ఆనవాళ్లు..


ఆలయగుట్ట దిగువ భాగంలో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాటిగడ్డ అనే ప్రదేశంలో శాతావాహన కాలం నాటి ప్రాచీన ఆనవాళ్లు కొద్ది



ఎత్తైన ఆహ్లాదకరమైన ఆలయగుట్ట

సంవత్సరాల క్రితం బయటపడ్డాయి. శాతవాహనుల కాలంలో ప్రజలు ఉపయోగించిన మట్టిపాత్రలు, కుండలు, పెంకులు, టెర్రకోట బొమ్మలు మృణ్మయపాత్రలు, మట్టిపూసలు(ఆభరణాలు), బుద్ధిని ప్రతిమ బయటపడ్డాయి. దీంతో పురావస్తుశాఖ వారు కూడా ఇక్కడ నెల రోజులపాటు తవ్వకాలు జరిపి మరిన్ని పనిముట్లను కనుగొన్నారు. ఇవన్ని కూడా శాతవాహనుల కాలం నాటివిగా నిర్ధారించారు. అప్పట్లో ఈ ప్రాచీన ఆనవాళ్లపై పార్లమెంట్‌లో కూడా చర్చ జరగడం గమనార్హం. కాకతీయు కాలం కంటే ముందు క్రీ.పూ 200 సంవత్సరాల నుంచి క్రీ.శ 200 సంవత్సరాల వరకు కరీంనగర్ జిల్లా కోటిలింగాలను కేంద్రంగా

మిగతా 8వ పేజీలో..









హముతండాలో ట్రాక్టర్‌లో మృతదేహాలు

హముతండాలో విషాదం

నలుగురి దుర్మరణం ఘటనతో గ్రామస్థుల కన్నీరుమున్నీరు

గూడూరు, జనవరి 16: విధి వైపరీత్యం అంటే ఇదేనేమో..! జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. దేవుడిని దర్శించుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో హము తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ గిరిజన కుటుంబాన్ని బలితీసుకుంది. ఆటోను కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికతో పాటు బావమరిది సంతోష్ (సర్దార్), అత్త శాంతిలతో కలిసి నల్గొండ జిల్లా నాగార్జున్‌సాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఆటోలో వెళ్లారు. అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలు దేరారు. మహబూబాబాద్‌కు చెందిన కారు గుంజేడు నుంచి మహబూబాబాద్‌కు వైపువస్తూ ఎదురు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లావత్ శ్రీనుతోపాటు తల్లిపాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అత్త శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. కాగా, మూడు సంవత్స రాల క్రితం శ్రీను భార్య సంధ్య (శిరీష) కొవిడ్‌తో మృతి చెందింది. సంక్రాంతి పండుగ వేళకుమారుడి పుట్టువెంట్రుకలు ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో హముతండాలో విషా దఛాయలు అలుముకున్నాయి. కాగా, సోమవారం నలుగురి మృతదేహాలకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ నివాళ్లర్పించారు. జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.



కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను కుటుంబం (ఫైల్)


అత్తారింటికి వచ్చిన వ్యక్తిపై దాడి

తీవ్ర గాయాలపాలైన యువకుడు

పెద్దవంగర, జనవరి 16: మండలంలోని కొరిపెల్లిలో ఓవ్యక్తిపై దాడి చేయగా, తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలరానికి చెందిన తుమ్మ దీపకొరెడ్డి- మహేశ్వరి దంపతులు కుమార్తె రిషితతో కలిసి సంక్రాతి పండుగ సందర్భంగా సోమవారం కొరిపెల్లిలోని అత్తగారైన నీరటి నాగమ్మ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మిత్రులతో కలిసి బయటకు వెళ్లగా, పెద్దచెరువు సమీపంలో దీపకొరెడ్డిపై అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయికుమార్, మహేష్, రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో దీపకొరెడ్డిని బంధువులు, గ్రామస్థులు చిక్సిత నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేయిట్ తరలించారు. అనంతరం మెరుగైన చిక్సిత కోసం హన్మకొండకు తరలించారు. అయితే పాత కక్షలతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కాగా, దీపకొరెడ్డి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న తుమ్మ దీపక్‌రెడ్డి



ఐలోని మల్లన్న.. సల్లంగ సూడు..

● మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు ● మహానివేదనతో మార్నేనియుల దేవుడి రథం ఊరేగింపు

ఐనవోలు, జనవరి 16: పూసల లాగులు.. గజ్జెల మోత.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీరకోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నొదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు.. అందులో వెలుగుతున్న దీపాల మధ్య గుంపులు గుంపులుగా జానపద గేయాలతో శివసత్తులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు.. ఐలోని మల్లన్న ఆలయంలో భక్తిపారవశ్యాన్ని ప్రతిబింబించాయి. ఇక ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు ఢమురక శబ్దాలతో భక్తులకు స్వామి వారి కృప కలగాలని స్థుతించారు. సకం భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముచ్చమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలంటూ.. పర్వతాల మల్లయ్య మా పాలిట కలిగి ఉంటూ.. సల్లంగా సూడు మళ్లీ వస్తాం..' అంటూ స్వామి వారిని వేడుకున్నారు.



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు



మహానివేదనతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మార్నేనియుల పెద్దరథం

పోటెత్తిన భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీక అయిన బండారితో మల్లన్న క్షేత్రం పసుపుమయమైంది. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదిప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథంను డీసీసీబీ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్ రావు స్వగృహంలో సుందరంగా తీర్చిదిద్దారు. మార్నేని వంశీయులు ఆధ్వర్యంలో మహానివేదనతో బయలుదేరిన రథం గ్రామ పురవీదుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళహారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభ బండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథం ప్రదర్శన సాయంత్రం 7నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీసభ్యులు సంప్రదాయపద్ధతిలో సన్మానించారు.

7లక్షల మంది భక్తుల దర్శనం

ధ్వజారోహణం రోజు నుంచి సోమవారం వరకు సుమారు 7లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారుల అంచనా వేశారు. 17న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధవారాల్లో లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థ ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

అధికారుల సేవలు

జాతరలో పోలీసుసేవలు భేష్‌గా నిలిచాయి. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు నేతృత్వంలో పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాడ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 500మంది విధులు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య సిబ్బందితోపాటు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్(గ్రామ పంచాయతీ) సిబ్బంది నాలుగు రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ సునీత ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన ట్యాంకర్లు, నల్లాలు ద్వారా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్‌ల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి- ఆర్టీసీ బస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.



గజ్జెల లాగు పూసల అంగీలో మల్లన్న భక్తుడు



ఐనవోలు మల్లికార్జున ఆలయం ఆవరణలో బోనంతో నృత్యం చేస్తున్న శివసత్తి



స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ దయాకర్, కుటుంబసభ్యులు



స్వామి వారి సన్నిధిలో మాజీ మేయర్ దంపతులు స్వర్ణవరదరాజేశ్వర్‌రావు

23 నుంచి కేయూ ఇంజనీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 16: ఈ నెల 23 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 25, 27, 29, 31,ఫిబ్రవరి 2, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, డెటాసైన్స్ సబ్జెక్టులో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని ఇంజరింగ్ కళాశాల, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

19న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, జనవరి 16: ఈ నెల 19వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాది కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సెస్ బ్యాంకులో సుమారు 80 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సు గల ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848895937, 9700922136లో సంప్రదించాలని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



గునిగంటి తిరుపతి (ఫైల్)

ఎల్కతుర్తి, జనవరి 16: తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడి అక్కడిక్కడే గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42) వృత్తిలో భాగంగా తాటి కల్లు గీయడానికి వెళ్లాడు. గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో మోకు జారీ పైనుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజురాబాద్ సివిల్ అస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె రక్షిత, కుమారుడు సాత్విక్‌లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు తిరుపతి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

నర్సింహులపేట, జనవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వంతడుపలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (48) గ్రామ రెవెన్యూ పరిధిలో రెండేళ్ల కిందట కోళ్లఫామ్ ఏర్పాటు చేసుకుని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్లఫామ్‌లో ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. తెచ్చిన అప్పులు రెట్టింపుకావడం, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తొర్రూరు ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని బోటిమీదితండా శివారు కొండెంగెలగుట్ట తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటికను మంగళవారం పట్టుకొని స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. కొండెగల గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్నమాలు తన ఇంట్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 కింటాళ్ల పటిక నిల్వచేసి తండావాసులకు విక్రయిస్తున్న క్రమంలో పట్టుకొని సీజ్ చేసి బానోత్ చిన్న మాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు.



మేడారంలో వనదేవతలను దర్శించుకున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారంలో భారీగా భక్తజనం

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి, కనుము పండుగల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరకొని వనదేవతలకు పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం (బంగారం) సమర్పించారు. యాట మొక్కులను చెల్లించుకున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ మంత్రి ఈటల రాజేందర్

భీమదేవరపల్లి, జనవరి 16: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మట్టి బిడ్డనని, కరీంగనర్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అప్పుడు పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజలతో తనకు విడదీయరాని అను బంధం ఉందన్నారు. కానీ కరీంనగర్‌లో తమ సిట్టింగ్ ఎంపీ ఉన్నారన్నారు. దీంతో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం తాము వ్యతిరేకం కాదని, కానీ దీంతో పేదలైన ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్‌గౌడ్, మాచర్ల కుమార్, అంబీరు కవిత, గోదాల సంపత్, గుండెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా...

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భీమదేవరపల్లి, జనవరి 16: పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కొత్తకొండ జాతరలో సోమవారం వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని తమ పార్టీ న్యాయకత్వాన్ని ఎదురించి తెలంగాణను సాధించామన్నారు. తాను వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పేరుతో ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, నాయకులు ఆదరి రవిందర్, కొల్గూరి రాజు, రవీందర్, డబ్బా శంకర్, మడిపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ రుత్విక్‌సాయికి తెలంగాణ కేడర్



హనుమకొండ రూరల్, జనవరి 16: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన కొట్టె రుత్విక్ సాయికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ రాంనగర్‌కు చెందిన రుత్విక్‌సాయి ఐపీఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 460వ ర్యాంకర్ పత్తిపాక సాయికిరణ్‌కు కూడా తెలంగాణ కేడర్ దక్కింది.

జై వీరభద్రా..

● భక్త జన జాతరగా మారిన కొత్తకొండ
● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్
● ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది.. ఎటు చూసినా క్యూలైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపోయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కుమార్, వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ, డీసీపీ బారీ, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ దూడల ప్రమీల - సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు.

ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాడింది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ బారీ, ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 400మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు తిరిగి తమ విధుల్లోకి చేరేందుకు వెళ్లారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాడు నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

మొక్కులు చెల్లించిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడురోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 65 ఎండ్లబండ్ల రథాలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరభద్రస్వామి



భద్రకాళి అమ్మవారు

పారిశుధ్యం భేష్

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు భేష్‌గా ఉన్నాయి. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో జాతరలో అధికారుల సేవలను పరిశీలించారు. డీపీవో జగదీశ్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 150మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.



వేలేరు నుంచి వచ్చిన మేకల రథం



శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా



గండదీపంలో నూనె పోస్తున్న యువతులు





నాగేంద్రుడికి కోటి పుష్పార్చనలు

గీసుగొండ, జనవరి 16: ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరాయన పుణ్యకాలం సందర్భంగా మంగళవారం నాగేంద్రుడికి కోటి పుష్పాలతో మంగళవారం అలంకరించారు. సూర్య భగవానుడు మకరరాశిలోకి సంక్రమణ చెంది కాంతిని జీవకోటికి అందించటం వలన మకర సంక్రాంతిగా చెప్పుకుంటామని ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్షశ్రవనాచార్యులు, ఆలయకమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, సర్పంచ్ నాగదేవత, ఎంపీటీసీ వీరారావు, ఊకల్ సొసైటీ చైర్మన్‌వీరస్వామి, కె.రవిందర్ పాల్గొన్నారు.



కోటలో సందడి



ఏకశిల పిల్లల పార్కు కిటకిట

ఖిలావరంగల్, జనవరి 16: సంక్రాంతి పర్వదినంతో పాటు పాఠశాలకు సెలవులు రావడంతో ఖిలావరంగల్ కోట పర్యాటకులతో సందడిగా మారింది. మధ్య కోటలోని ఏకశిల పిల్లల పార్కులో పిల్లలు, పెద్దలు ఉల్లాసంగా గడిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు నగరంలోని వివిధ పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. అలాగే కోటను ఇటలీ ప్రాంతానికి చెందిన విదేశీయురాలు సోమ వారం సందర్శించారు. ఇటలీ ప్రాంతం నుంచి వచ్చిన స్టార్లిన్ వరంగల్‌లోని రామప్ప, గణపురం, కోటగుళ్ళు, వేయిస్తంభాల దేవాలయంతోపాటు కోటను సందర్శించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

• గాలిపటాల ఎగురవేత • ఆలయాల్లో ప్రత్యేక పూజలు • మహిళలకు ముగ్గుల పోటీలు

శంభునిపేట, జనవరి 16: సంక్రాంతి సంబురాలు నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. గాలిపటాలు ఎగురవేసి, విందు వినోదాలతో ఆనందంగా గడిపారు. 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో కర్నె రవీందర్ ఆధ్వర్యంలో కైట్స్ ఫెస్టివల్ నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమ, మంగళవారాలు అర్చకులు గంగు సతీష్ శర్మ, చైర్మన్ కర్నె రవీందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగశాయిపేట రామాలయంలో తిరుమల శ్రీధరాచార్యులు, భవానీ శంకరాలయంలో శివప్రసాద్ శర్మ, రామలింగేశ్వరాలయంలో గంగు రాజేంద్రప్రసాద్ శాస్త్రిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రంగశాయిపేటలో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. 29ఏళ్లుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహరాములు తెలిపారు. సుభాస్ చంద్రబోస్ పరపతి సంఘం అధ్యక్షుడు శెంకేశి శ్రీనివాసమూర్తి విజేతలకు బహుమతులు అందించారు.



గోవిందరాజుల గుట్ట వద్ద విజేతలకు బహుమతులు అందజేత



ఆశాలపల్లి మల్లికార్జున ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

» గిర్మాజీపేట: సంస్కృతి, సంప్రదాయాలతోపాటుగా విజ్ఞాన వికాసమే సంక్రాంతి పండుగని సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండెల మోహన్‌రావు అన్నారు. సోమవారం సంక్రాంతి సందర్భంగా శ్రీగోవిందరాజుల గుట్ట ప్రాంగణంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రైల్వే జడ్‌ఆర్‌యుసీసీ చింతాకుల సునీల్ కుమార్, వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు డి.సీతారామ్, వి.సుజాత, కూచన క్రాంతికుమార్ పాల్గొన్నారు.

» గీసుగొండ: భోగి, మకర సంక్రాంతి, కనుమ వేడుకలను మండలంలో మూడు రోజులపాటు ఘనంగా జరుపుకున్నారు. దూరప్రాంతాల్లో [illegible] బంధుమిత్రులు గ్రామాలకు తరలిరావడంతో కొత్తశోభ సంతరించుకుంది. ఇళ్ల ముందు రంగవల్లుల [illegible].

» సంగెం: గవిచర్ల- అశాలపల్లి గ్రామాల మధ్యన గల శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ కూచన సమ్మయ్య నేతృత్వంలో ప్రత్యేక పూజలు, ఒగ్గు పూజారుల చేత మల్లన్న పట్నం వేశారు. అశాలపల్లి, గవిచర్ల, షాపూరం, రాంచంద్రాపురం, లోహిత, కాపులకనపర్తి, కాట్రపల్లి, సంగెం, కుంటపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అశాలపల్లి సర్పంచ్ బి.కిషోర్‌యాదవ్ పాల్గొన్నారు.



ఆశాలపల్లి మల్లికార్జున ఆలయంలో పూజలు చేస్తున్న చైర్మన్, సర్పంచ్



రంగశాయిపేటలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల అందజేత



అయ్యప్ప పడిపూజ ఉత్సవం నిర్వహిస్తున్న ఆలయ సేవా బృందం

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

పోచమ్మమైదాన్, జనవరి 16: కొత్తవాడలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ, ఉత్తరాయణ పుణ్యకాలం, శబరి జ్యోతి దర్శనాన్ని పురస్కరించుకొని ఆలయసేవ బృందం ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. 18మెట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. పడి పూజకు కొత్తవాడ, ఆటోనగర్, తుమ్మలకుంట, దేశాయిపేట, పద్మానగర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో కంబంపాటి కుమారస్వామి, ఎల్చుల అంజన్నయాదవ్, బండి సంజీవ్, యెలుగం వెంకటమల్లు, వీరస్వామి, మాజీ కార్పొరేటర్ వైశ్రీనివాస్ పాల్గొన్నారు.

21న సీతారాముల కల్యాణం

పోచమ్మమైదాన్, జనవరి 16: అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని గురుధామంలో 21న సమిష్టి శ్రీ సీతారాముల కల్యాణము, పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. పైడిపెల్లిలోని గురుధామ్‌లో (సప్తధామ్) మంగళవారం శివానంద గురు కల్చరల్ ట్రస్టు శ్రేణులు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకల్లో సుమారు 500 జంటలు పూజలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయి నారాయణ, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, రేపాల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుంది: రేవూరి

గీసుగొండ, జనవరి 16: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం గ్యారెంటీ పథకాలను దశల వారీగా ప్రభుత్వం అమలు చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. అల్లం జోజిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.15 లక్షలతో నిర్మిస్తున్న గంగదేవిపల్లి ఆర్చీగేటుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తే 10సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. బాలకిశోర్‌రెడ్డి పేద విద్యార్థులకు, బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని, అల్లం కిశోర్‌రెడ్డిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, సర్పంచ్ గోనె మల్లారెడ్డి, అల్లం మర్రెడ్డి, డీటీఎం కూసం రాజమౌళి, గోనె కుమారస్వామి నాయకులు చాడా కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, కూసం రమేష్, కొమ్ము శ్రీకాంత్, మాదాసి రాంబాబు పాల్గొన్నారు.

» గీసుగొండ, జనవరి 16: ఈనెల 23 నుంచి అత్యంత వైభవంగా జరిగే గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర వాల్‌పోస్టర్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి స్వగృహం హన్మకొండలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర విజయవంతం చేయటానికి అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, నాయకులు చాడా కొమురారెడ్డి, ఏనుగుల రాంరెడ్డి, వటుకుల ప్రశాంత్‌రెడ్డి, కందికొండ చంద్రమౌళి, బోడకుంట్ల రాజు, తాటికొండ నరేందర్, కోట అశోక్, జీవన్ పాల్గొన్నారు.



గంగదేవిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

» సంగెం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన మహిళ కోలాటం బ్యాచ్ సంఘాలు ప్రచురింపజేసిన నూతన సంవత్సర క్యాలెండర్లను హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోలాటం బ్యాచ్ మహిళలు రావుల రాధిక, సింగం యాకలక్ష్మి,రాగిరి సరిత, కావాటి రజిత, డ్యాన్స్ మాస్టర్ దోనీ, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు గుర్తింపు తేవాలి



పీఈటీ సృజన

ఖిలావరంగల్, జనవరి 16: సౌత్‌జోన్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు గుర్తింపు తీసుకురావాలని మధ్యకోటలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కక్రాజు వెంకటయ్య అన్నారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో జనగామ క్రిస్టన్ స్కూల్ స్టేడియంలో జరిగిన సాఫ్ట్‌బాల్ సౌత్‌జోన్ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన పీఈటీ సృజనను జాతీయస్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 9జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో రాణించిందన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మామునూరు, జనవరి 16 : మామునూరులో ర్యాంబో యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్ కిరణ్ క్రీడాకారులకు క్రికెట్ కిట్లును అందజేశారు. కార్పొరేటర్‌ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖవిద్యావేత్త గంటా రామారెడ్డి, మాజీ జడ్పీటీసీ జి.నరేందర్‌రెడ్డి, రాంబో యూత్ అధ్యక్షుడు సింగారపు రాహుల్, కార్యదర్శి ఎర్ర చందు, కె.అనిల్, కె.దీపక్, వినీల్ పాల్, బన్నీ, విక్టోరియా పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గీసుగొండ, జనవరి 16: గీసుగొండ గ్రామానికి చెందిన పేద విద్యార్థి బండారు రవికుమార్‌కు స్థానిక రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి గీతా లక్ష్మీనారాయణ దంపతులు రూ.లక్ష ఆర్థికసాయం మంగళవారం అందించారు. రవికుమార్ టెన్త్‌లో ప్రతిభ కనబరిచి త్రిపుల్‌ఐటీ బాసరలో సీటు సాధించారు. అందులో 6 సంవత్సరాల బీటెక్ పూర్తిచేసిన అతనికి అమెరికాకు వెళ్లేందుకు అవకాశం లభించింది. తల్లిదండ్రులు లేని అతడు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటం తెలుసుకున్న లక్ష్మీనారాయణ ఆర్థికసాయాన్ని అందించారు. ఎలుకుర్తిలో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ. 10 వేల విరాళాన్ని అందించారు.

చెస్ క్రీడాకారిణికి సన్మానం

మామునూరు, జనవరి 16 : దక్షిణ భారత (సౌత్ జోన్) ఇంటర్ యూనివర్సిటీ చెస్ క్రీడాకారిణి బోగోజు దేవికను మంగళవారం సత్కరించి సన్మానించారు. 43వ డివిజన్ గణేష్ నగర్‌కు చెందిన దేవిక కాకతీయ యూనివర్సిటీ చెస్ మహిళా జట్టు తరుపున ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరిగిన దక్షిణ భారత దేశ ఇంటర్ యూనివర్సిటీ చెస్ క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించింది. డివిజన్‌లోని ఏఆర్‌కె సేవా అంజూమన్ సొసైటీ ఆధ్వర్యంలో దేవికకు రూ.10,016 నగదు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రంగశాయిపేట బాలికల పాఠశాల పీఈటీ గోగు నారాయణ ఏఆర్‌కె అంజూమన్ సొసైటీ ఫౌండర్, బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ యాకుబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క కొమురెల్లి, గణేష్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విజయ్, అంజూమన్ సొసైటీ సెక్రటరి అక్రమ్ రహమాన్ ఖాన్, కోశాధికారి సాదిక్ అలీ, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం మహాజాతర అభివృద్ధి పనులపై ఆరా



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

మేడారం, జనవరి 16 : మేడారాన్ని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ వేర్వేరుగా పర్యటించారు. మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కూలీల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగు నుంచి ఊరట్టం స్థూపం వరకు ప్రతిపాదిత పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీ1, సీ2 పార్కింగ్ కోసం సుమారు 95 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, పైప్‌లైన్ల ఏర్పాటు, మహిళలు బట్టలు మార్చుకునే గదుల నిర్మాణం, ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, వాగులో ఇసుక చదును పనులను కలెక్టర్, పీవో పరిశీలించారు. మేడారం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించాలన్నారు. అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఏటీఎంల ధ్వంసం

5వ పేజీ తరువాయి

రమేష్‌లు సీసీ ఫుటేజీల ఆధారంగా సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారని డీసీపీ తెలిపారు. వంశీపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడిం చారు. ఈ సంఘటనల్లో సుమారు. రూ. 4.05లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ తిరుమల్, సీఐ రవికుమార్, ఎస్సై రవి పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే నరసింహుడు..

5వ పేజీ తరువాయి

చేసుకొని శాతవాహనులు పరిపాలించినట్లు పర్యాటక శాఖ కన్సల్టెంట్ అరవింద్ ఆర్యా తెలిపారు. ఈ సమయంలో ఆలయగుట్ట వద్ద శాతవాహనులు వైవిధ్య పనిముట్లను వాడినట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. ఆధునిక నాగరికతకు ఇక్కడ కొంత బీజం పడిందని వివరించారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

ఈనెల 23 నుంచి 27 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు వేదాంత వెంకటనరసింహచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కల్యాణోత్సవం, 24న హోమబలిహరణం, 25న పూర్ణాహుతి, రాత్రి జాతరబండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి చేరుకుంటుందన్నారు.



దొంగలను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఇద్దరు దొంగల అరెస్టు

మామునూరు, జనవరి 16 : నాయుడు పెంటోల్ పంపు వద్ద ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు మామునూరు సీఐ కాంత్రికుమార్ తెలిపారు. గీసుకొండ మండలం ఎలుకుర్తికి చెందిన రాకేష్ (27), హైదరాబాద్ చంద్రాయణగుట్టకు చెందిన సత్తూరి కుమార్ (32)లను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వివరించారు. బొల్లికుంటకు చెందిన సోల్తి అశోక్ అయ్యప్పమాల ధరించగా, ఈనెల 6న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రకు వెళ్లారు. తాళ్లం వేసి ఉన్న ఇంట్లో చొరబడి అయిదున్నర తులాల బంగారంతోపాటు రూ.1.10 లక్షల నగదును దొంగలించారు. ఎస్ఐ క్రిష్ణవేణి జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా ఉన్న రాకేష్, కుమార్‌లను పట్టుకున్నట్టు తెలిపారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన క్రిష్ణారెడ్డి అనే వ్యక్తి కూడా ఈ కేసులో ఉన్నట్లు సీఐ తెలిపారు. చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి క్రిష్ణారెడ్డి ఈనెల 4న విడుదలయ్యాడని, విడుదలై రెండు రోజులకే రాకేష్, కుమార్‌లతో కలసి దొంగతనానికి పాల్పడినట్లు చెప్పారు. దొంగతనానికి పాల్పడ్డ ఈ ముగ్గురు గతంలో జైలులోనే పరిచయం అయినట్లు సీఐ తెలిపారు. క్రిష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు చెప్పారు. దొంగల నుంచి రూ.11 వేల నగదును రికవరీ చేసినట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

ఉత్సవాలకు సహకరిస్తాం..: మంత్రి సురేఖ

శంభునిపేట, జనవరి 16 : రంగశాయిపేటలో నిర్వహించనున్న గ్రామదేవత (బొడ్రాయి) ప్రతిష్ఠాపన ఉత్సవాలకు తమవంతు సహకారం అందిస్తామని తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రంగశాయిపేట యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో ఆర్‌వైఎఫ్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రంగశాయిపేట ప్రాంతంలో ప్రజల మద్దతుతో ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు గ్రామదేవతా ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు.

• అమ్మవారిపేటలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర కు ప్రభుత్వపరంగా తగు ఏర్పాట్లు కల్పించాలని జాతర నిర్వాహకులు మంత్రి కొండా సురేఖను కోరారు. జాతర చైర్మన్ కొడూరి భిక్షపతి ఆధ్వ ర్యంలో మంగళవారం మంత్రిని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో చైర్మన్ కొడూరి భిక్షపతి, జాతర ఆర్గనైజర్ దాసి రాందేవ్, కోశాధికారి బైరి నాగరాజు, హరినాథ్, ఆవునూరి కుమారస్వామి, కేడల పద్మ, మంతెన సునీత, బజ్జూరి వీరేశం, ఆనందం, అశోక్, స్వామి, నాగరాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

• వరంగల్‌టౌన్: నగరంలోని 19వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మంత్రి సురేఖను హనుమకొండలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

• వరంగల్ సిటీ: తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రికి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. అజీం, గౌరవ అధ్యక్షుడు అంబటి రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు బండి చక్రపాణి, ప్రధానకార్యదర్శి గై సతీష్, కోశాధికారి బత్తిని రాజు, ఉపాధ్యక్షులు పాకాల మనోహర్, బిల్ల రమేష్, ఊరుగొండ అశోక్, సిరిపురపు రాజేశ్వర్, మహిళా కార్యదర్శులు అడ్లూరి వాణి, సంగి సునీత సహాయకార్యదర్శులు శ్రీధర్, అబ్దుల్ షబ్బీర్, నీలం రాజు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న రంగశాయిపేట ఉత్సవ నిర్వాహకులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

దుగ్గొండి, జనవరి16: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జె..కావ్యశ్రీ, ఎస్. దీపిక, జె. జ్ఞానేశ్వరులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరు 14న కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14 విభాగంలో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం, భద్రమ్మ, పీఈటీ వీరగోని స్వప్నలు తెలిపారు. మంగళవారం నుంచి 18వ తేదీ వరకు ఆర్మూర్‌లో జరుగుతున్నరాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారని వారు తెలిపారు. ఈసందర్భంగా సర్పంచ్ చుక్క రమేశ్, పాఠశాల చైర్మన్ జగదీశ్వర్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మకరజ్యోతిని దర్శించుకున్న మాలాధారులు


నర్సంపేటలోని అయ్యప్ప ఆలయవద్ద మకరజ్యోతిని దర్శిస్తున్న మాలాదారులు, భక్తులు

నర్సంపేట, జనవరి 16 : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్త్రాఅయ్యప్పస్వామి దేవాలయం సోమవారం రాత్రి భక్తులు మాలాదారుల శరణుగోషతో మార్మోగింది. ఆలయశిఖరంపైపవిత్ర మకరజ్యోతి మాలాదారులకు దర్శనమిచ్చింది. అయ్యప్పభక్తులు భక్తి శ్రద్దలతో ఈ మకర జ్యోతిని దర్శించుకున్నారు. అయ్యప్ప దేవాలయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాదవశంకర్ ఆధ్వర్యంలో మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య శింగిరికొండమాదవశంకర్ ఇళ్లలో పూజలు చేసి భాజాభజంత్రీల మధ్య మాలాదారులు, భక్తులతో కలిసి ఆభరణాలను ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆలయ శిఖరంపై వెలిగినమకరజ్యోతిని మాలాదారులు, భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, భక్తులు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య వేడుక


కాటమయ్య బోనం పండగ నిర్వహిస్తున్న దృశ్యం

వర్ధన్నపేట, జనవరి 16: వర్ధన్నపేట పట్టణంలో మంగళవారం కాటమయ్య వేడుకలను తూర్పువాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం నిర్వహించే కాటమయ్య బోనం పండగ అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ సురమాంబ దేవిసమేత కంఠమహేశ్వరస్వామి, వనం మైసమ్మ ఎల్లయ్యదేవిలకు నైవేద్యాలు సమర్పించిన ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీహరి, ప్రసాద్, గట్టు ఏకాంబరం, కర్ణాటక మల్లయ్య లక్ష్మణ్, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

పాకాల యాసంగి తైబందీపై

స్పష్టమైన ప్రకటన చేయాలి

ఖానాపురం, జనవరి 16: పాకాల యా సంగి తైబందీపై ఎమ్మె ల్యే దొంతి మాధవ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీ ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. పాకాల ఆయకట్టులో యాసంగిలో పూర్తిస్థాయిలో పంటల సాగుకు సాగునీటిని అందిస్తారా ? లేదా ? అనే అయోమయం నేడు ఆయకట్టు రైతుల్లో నెలకొందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల ప్రమేయం లేకుండానే పూర్తిస్థాయిలో యాసంగి సాగుకు నీటిని అందిస్తామని డిసెంబరులో ప్రకటన చేసిన కాంగ్రెస్ నాయకులు చివరి ఆయకట్టుకు సాగునీరు వెళ్లకుండా సంగెం కాలువకు ఇటీవల అడ్డుకట్ట వేయడం రైతులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు.

తైబందీ ప్రకటనతో ఇప్పటికే నార్లు పోసుకున్న రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున తైంబదీపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీవో స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో రైతులకు జరిగే నష్టానికి కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, రాగంపేట సర్పంచ్ బాషబోయిన ఐలయ్య, తక్కళ్లపెల్లి బాబురావు, మౌలానా, పగడాల రాంనర్సింహారెడ్డి, కోరె సుధాకర్, రాధారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేరు వేరు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 16 : మండలంలోని కట్య్రాల, ఇల్లంద గ్రామాల్లో వేరు వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కట్య్రాలలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఇల్లందలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో మరో యువకునికి గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా చెన్నకేశవ స్వామి జాతర

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


మొక్కులు చెల్లించుకుంటున్న దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట జనవరి 16: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని వైభవంగా నిర్వహించే శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర సోమవారం సంక్రాతి పండుగ రోజున అంగరంగ వైభవంగా కొనసాగింది. జాతరకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు తరలి వచ్చారు. గుట్ట ముందు ఉన్న స్వామి వారి గద్దె ముందు తమ కోర్కెలు తీరాలని భక్తులు ముడుపులు కట్టారు. మండలంలోని భక్తులతో పాటు నెక్కొండ, గూడురు, ఖానాపురం, నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి, సంగెం, కేసముద్రం మండలాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శన చార్యులు రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా నెక్కొండ సర్కిల్ సీఐ హతీరాంనాయక్. ఎస్సై పస్తం శ్రీనువాస్, పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తును నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, అయన కుమారుడు ఆదీయుత్వరెడ్డి, నాయకులు, ఎంపీడీవో భారతి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మదారాపు బాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యగోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సర్పంచ్ సిద్దెన రమేష్, తప్పెట రమేష్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, మంద యాకయ్యగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, కాంగ్రెస్ నియోజవర్గ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి శ్రీనువాస్, గజ్జి రాజు, కర్నాటి పార్వతమ్మ, యూత్ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న ఆశీస్సులు అందరిపై ఉండాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


కట్య్రాలలో ఆలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట రూరల్, జనవరి 16 : కట్య్రాల కట్ట మల్లన్న ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని కట్య్రాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మల్లన్న జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన కమిటీని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ఆలయ అభివృద్ధిని విస్మరించారని, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హమీ ఇచ్చారు. జానపదుల జాతరగా మల్లన్న జాతర నియోజకవర్గంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఐనవోలు మల్లన్న జాతర తర్వాత కట్య్రాల, గోపనపెల్లిలో మల్లన్న జాతర ప్రాముఖ్యత సంతరించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, హైకోర్టు సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు గుజ్జ సంపత్‌రెడ్డి, చైర్మన్ కట్ట వెంకటయ్య, స్థానికులు బండారి సతీష్, అక్బర్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అరూరి ప్రత్యేక పూజలు..

కట్ట మల్లన్న స్వామికి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. ఆయన వెంట హన్మకొండ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పీఏసీఎస చైర్మన్ రాజేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడి.. కేసు నమోదు

చెన్నారావుపేట, జనవరి 16: నీటి పారకం విషయంలో దాడి చేసుకున్న ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనువాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చీమల కర్ణాకర్, శ్యామల సాంబయ్యలకు ఇద్దరి పొత్తులో వ్యవసాయ బావి ఉంది. ఈనెల 13న వ్యవసాయ బావి నీటి పారకం విషయంలో శ్యామల సాంబయ్య, శాంతమ్మలు ఒక వర్గంగా, చీమల కార్ణకర్, సతీష్‌లు మరో వర్గంగా ఏర్పాడి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటం జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

వ్యక్తిపై దాడి ఘటనలో ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీనువాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నెక్కొండ మండలానికి చెందిన ఈదునూరి వినయ్ ఈనెల 15న ద్విచక్ర వాహనంపై నర్సంపేట నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో అమీనాబాద్‌లో తన మిత్రులు కలువగా అక్కడ ఆగి వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన ఐత తిరుపతి, కొత్తగూడ మండలం వెలుబల్లికి చెందిన పసునూరి ప్రసాద్‌లు పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని దుర్భాషలాడుతూ వినయ్‌పై దాడి చేశారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా బాధితుడు వినయ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రధానోత్సవం

నల్లబెల్లి, జనవరి 16: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎంసీపీఐ(యూ) పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో దామ సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బానోతు సారంగపాణి ముఖ్య అతిధిగా హజరై క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

అనంతరం కబడ్డీ మండల ప్రథమ విజేత అయిన రుద్రగూడెం క్రీడాకారులకు, ముగ్గుల పోటీల విజేతలకు, వ్యా సరచనలో ప్రథమ స్థానం పొందిన విజేతకు బీఆర్ఎస్, ఎంసీపీఐ(యూ) పార్టీల సమక్షంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుసుంబ బాబురావు, కక్కెర్ల శ్రీనివాస్, పాలెపు రాజేశ్వర్‌రావు, కడియాల మనోహర్ పాల్గొన్నారు.

పెర్కవేడులో మల్లన్న జాతర


జాతరలో ఎడ్లబండిపై వస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, జనవరి 16 : మమ్మేలు మల్లన్న అంటూ నెత్తిన బోనాలతో, శివసత్తుల పూనకాలతో మండలంలోని పెర్కవేడులో మల్లన్న జాతర వైభవంగా జరిగింది. మంగళవారం జాతర సందర్భంగా చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మొక్కులు తీరిన అనంతరం ముడుపులు చెల్లిస్తారు. పెర్కవేడు మల్లన్న జాతరలో పొట్టేలు బండ్లు, ఎడ్ల బండ్లు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారాశ్రీ, ఎంపీటీసీ బండి అనూష, గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, వెంకటచారి, మంగిశెట్టి రాజు, రాజబాబు, హరిబాబు, కుల్ల వెంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మన పండుగలు ప్రపంచానికి ఆదర్శం

తెలంగాణ పండుగలు ప్రపంచానికే ఆదర్శమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవార మండలంలోని పెర్కవేడులో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మన పండుగలు, మన సంస్కృతినికి కొనసాగించి రాబోయే రోజుల్లో వైభవంగా జరుపుకుందామని తెలిపారు.

జాతరలో ఫ్లెక్సీల వివాదం


ఆలయ కమిటీ పేరుతో వెలిసిన ఫ్లెక్సీ


జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

పర్వతగిరి, జనవరి 16: మండలంలోని గోపనపెల్లి దూడెల మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు వివాదానికి కారణమవుతున్నాయి. ఆలయానికి ఎలాంటి కమిటీ లేకపోయిన్పటికీ కొందరు అధికారపార్టీ నాయకులు చైర్మన్, డైరెక్టర్ల పేర్లతో జాతన సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అధికారికంగా కమిటీ లేకపోయినా ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటుచేస్తారని పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు సైతం ఫ్లెక్సీల విషయం పట్టించుకోవడంలేదని, అధికారపార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారని వారు మండిపడ్డారు. మరోవైపు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పాలకవర్గం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ మాజీ సీఎం, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఫోటోలతో దర్శనమిచ్చింది. దీంతో పంచాయతీ పాలకులు గత ప్రభుత్వభ్రమలోనే ఉన్నారని ఇటు అధికార పార్టీ నాయకులు మండిపడ్డారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

చెన్నారావుపేట, జనవరి 16: యువత అన్ని రంగాలల్లో రాణించాలని కలామ్స్ పౌండేషన్ అధ్యక్షుడు ఎమ్డీ భాషమియా అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో సంక్రాంతి పండుగ పర్వదినం సందర్భంగా నిర్వహించిన డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం వీరగాధాలో దేశ వ్యాప్తంగా కోటి ఎంట్రీలల్లో 100 మంది ఎంపిక కాగా వారిలో కాసాని కీర్తీ ప్రసన్న ఎంపిక కావటం పట్ల ఆమెను పౌండేషన్ వారు సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల మానస, శ్రీధర్‌రెడ్డి, మానస, పెల్లి ప్రభాకర్, బల్గూరి మహేందర్, రుద్ర రాజు, పరకి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంల ధ్వంసం

(5వ పేజీ తరువాయి)

రమేష్‌లు సీసీ పుటేజీల ఆధారంగా సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారని డీసీపీ తెలిపారు.

వంశీపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సంఘటనల్లో సుమారు. రూ. 4.05లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ తిరుమల్, సీఐ రవికుమార్, ఎస్సై రవి పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే నరసింహుడు..

(5వ పేజీ తరువాయి)

చేసుకొని శాతవాహనులు పరిపాలించినట్లు పర్యాటక శాఖ కన్సల్టెంట్ అరవింద్ ఆర్యా తెలిపారు. ఈ సమయంలో ఆలయగుట్ట వద్ద శాతవాహనులు వైవిధ్య పనిముట్లను వాడినట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. ఆధునిక నాగరికతకు ఇక్కడ కొంత బీజం పడిందని వివరించారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

ఈనెల 23 నుంచి 27 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు వేదాంత వెంకటనరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కల్యాణోత్సవం, 24న హోమబలిహరణములు, 25న పూర్ణాహుతి, రాత్రి జాతరబండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి చేరుకుంటుందన్నారు.

ఘనంగా దూడెల మల్లన్న జాతర


గోపనపెల్లి జాతరలో బోనాలు తయారుచేస్తున్న భక్తులు

పర్వతగిరి, జనవరి 16: మండలంలోని గోపనపెల్లిలో గల దూడెల మల్లికార్జునస్వామి ఆలయ జాతర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో బోనాలు తయారుచేసి స్వామివారికి నైవేద్యాలను సమర్పించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

దూడెల మల్లికార్జునస్వామి ఆలయా న్ని వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దర్శించుకున్నారు. గ్రామ ప్రధానకూడలి నుంచి డప్పుచప్పుళ్లు, కోలాటాలతో ఊరేగింపుగా ఆలయానికి రాగా ఆలయ పూజారులు ఆలయ సాంప్రదాయం ప్రకారం వారికి స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, దేవేందర్‌రావు, ఎంపీటీసీ మహేంద్ర, నాయకులు వెంకట్‌రెడ్డి, భిక్షపతి, అనీల్, ప్రమో ద్ తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ దూడెల మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు పాల్గొన్నారు.

టీజేఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్


రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

నర్సంపేట, జనవ రి 16 : విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జనసమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరుగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో సదస్సు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని కేంద్రంపై వత్తిడి తీసుకురావడంలో గత బీఆర్ఎస్ విఫలమయిందన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు, కేంద్ర ప్రభుత్వ వివక్షతపై రాష్ట్ర సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను తేల్చాలని, ఉద్యోగుల విభజనను పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయిసంస్థలను, ఆస్తులను విభజించాలని, రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, బయ్యారం ఉక్కఫ్యాక్టరీ, ఖాజీపేటలో రైల్వేకోచ్‌ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని డి మాండ్ చేస్తూ టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. జావీద్, గుంటిరాంచందర్, బొనగాని రవీందర్, సాంబరాతి మల్లేశం, గుంటి సంజీవ, సోల్తిసాయికుమార్, సంధాని, యాకూబ్‌పాష, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సమైక్య భావం పెరుగుతుంది

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


నాచినపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

దుగ్గొండి, జనవరి16: గ్రామీణ ప్రాంతంలో క్రీడోత్సవాలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో సమైక్య భావం పెరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని నాచినపల్లిలో భారత ప్రజాతంత్రయువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడలను సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13, 14, 15, 16 తేదీలలో నిర్వహించగా మంగళవారం క్రీడలలో గెలిచిన వారికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలు జరుపడం అభినందనీయమన్నారు. కబడ్డీలో ప్రథమ స్థానం అశోక్ నగర్, ద్వితీయ స్థానం వెంకటాపురం, తృతియ స్థానం నాచినపల్లి, నాల్గవ స్థానం మేడపల్లి, వాలీబాల్‌లో ప్రథమ స్థానం బుచ్చిరెడ్డిపల్లి, ద్వితీయ స్థానం మేడపల్లి, షటిల్‌లో నర్సంపేటకు చెందిన వినయ్, ద్వితీయ స్థానం నర్సంపేటకు చెందిన సుశాంత్‌లు గెలుపొందారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎమ్డీ అజీజ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి అబ్దుల్లాఖాన్, హన్మకొండ అధ్యక్షుడు సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రాంరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్‌గౌడ్, మండల అధ్యక్షుడు పుప్పాల ఎల్లయ్య, చిన్న లక్ష్మణ్, చెన్నూరి కిరణ్‌రెడ్డి, నిర్వహణ కమిటీ చైర్మన్ పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, పొన్నం రాజు, బొల్ల ప్రశాంత్, మహేందర్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.